క్లుప్తంగా

దాచేపల్లి సీఐ బాధ్యతల స్వీకరణ



దాచేపల్లి : దాచేపల్లి ఎస్‌హెచ్‌వోగా గుత్తి వెంకట్రావ్ శనివారం బాధ్యతలు చేపట్టారు. వీఆర్ నుంచి బదిలీపై ఆయన వచ్చారు. ఎస్‌ఐలు దాసరి శివనాగరాజు, జి.సంధ్యారాణి, స్టేషన్ సిబ్బంది వెంకట్రావుకి స్వాగతం పలికారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సమర్థంగా పని చేయాలని సూచించారు.

మురుగు కాల్వల్లో పూడికతీత



మాచర్ల: భారీగా వానలు పడుతుండటంతో పట్టణంలో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయింది. స్పందించిన మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహరావు, కమిషనర్ పి.నాగేశ్వరరావు ఆయా ప్రాంతాలను సందర్శించారు. నీటి పారుదలకు పూడికతీత పనులు చేపట్టారు. అంబేడ్కర్ సెంటర్, రత్తయ్య బజార్, ప్రభుత్వాసుపత్రి ప్రాంతం, కొమ్మళ్ళ కాలువ ప్రాంతాల్లో దగ్గరుండి పనులు పరిశీలించారు. మురుగు కాల్వల్లో చెత్తా చెదారం తొలగించి, రోడ్లపై నిలిచిన నీటిని బయటకు మళ్లించే చర్యలు తీసుకున్నారు.

శని త్రయోదశి పూజలు



మాచర్ల పాత మాచర్లలోని గంగా పార్వతీ సమేత నగరేశ్వర స్వామి దేవాలయంలో శనివారం త్రయోదశి పూజలు నిర్వహించారు. శని త్రయోదశి సందర్భంగా ఉదయం నుంచే దేవాలయంలో అర్చకులు వంశీకృష్ణ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి, నవగ్రహాలకు తైలాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి దేవాలయ సమీపంలో ఉన్న ఇష్టకామేశ్వర దేవాలయ ప్రాంగణంలో శనైశ్చరునికి అర్చకులు భరణి పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆదివాసీ సదస్సుకు ఆహ్వానం

మాచర్ల రూరల్ ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం ఆదివారం నెల్లూరులో జరగనున్న దక్షిణాంధ్ర ప్రాంతీయ సదస్సుకు గిరిజనులంతా పెద్ద ఎత్తున తరలిరావాలని ఎంసీపీఐ రాష్ట్ర నాయకులు పోలేపల్లి అబ్రహం లింకన్, మాచర్ల జెడ్పీటీసీ మండ్లి పెద మల్లుస్వామిలు పిలుపునిచ్చారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం నందు నిర్వహించిన సమావేశం నిర్వహించారు. సదస్సు కరపత్రాలు ఆవిష్కరించారు. నాయకులు రామకృష్ణ నాయక్, కె.వెంకటేశ్వరరావు, కె.సైదులు, గాలి శివ తదితరులున్నారు.

పోయిన నగదు తిరిగి అందజేత

పిడుగురాళ్ల: ఏటీఎంలో పోయిన నగదు బాధితుడికి అందించిన ఘటన పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. సీఐ వెంకట్రావు వివరాల మేరకు.. పట్టణానికి చెందిన కిషోర్ ఎల్ఎస్‌పిక్చర్ ప్యాలెస్ సినిమా హాల్ పక్కన ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో రూ.52 వేల నగదును డిపాజిట్ మిషన్ ద్వారా డిపాజిట్ చేశాడు. నగదు ఖాతాలో జమ కాకపోవడం, తిరిగి రాకపోవడంతో బ్యాంకు మేనేజర్‌ను సంప్రదించాడు. ఇప్పుడే నగదు తిరిగి వచ్చిందని చెప్పగా.. ఏటీఎంలో చూశాడు. కానీ, నగదు కనిపించలేదు. మేనేజర్ సహాయంతో సీసీటీవీ ఫుటేజీ పరిశీలించగా.. నగదును ఓ వ్యక్తి తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. వెంటనే బాధితుడు ఫిర్యాదు మేరకు..పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. సోషల్ మీడియా ద్వారా విషయం తెలుసుకున్న బాజ్జి నాయక్ వెంటనే సీఐ వెంకట్రావుకు తనకు వచ్చిన రూ.52 వేల నగదును తిరిగి ఇచ్చాడు. కిషోర్‌కు అతని చేతుల మీదుగా నగదును అందజేయించినట్లు సీఐ తెలిపారు.

పింఛను అందజేసిన కలెక్టర్ అరుణ్ బాబు



గోళ్ళపాడు(ముప్పాళ్ళ):మండలంలోని గోళ్ళపాడు గ్రామంలో జరుగుతున్న పింఛన్ల పంపిణీని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు శనివారం పరిశీలించారు. పింఛన్‌దారులతో మాట్లాడి వారి కుటుంబ స్థితిగతులను, సకాలంలో పింఛను అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. మండలంలో 91 శాతం పింఛన్ల పంపిణీ పూర్తియినట్లు ఎంపీడీవో పి.పుట్టారెడ్డి తెలిపారు.

ముంచెత్తిన వర్షం



మాచర్ల: 14వ వార్డులో ఇళ్ల మధ్య నిలిచిన వర్షపు నీరు

మాచర్ల: మాచర్ల పట్టణంలో మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. గురువారం నుంచి ప్రారంభమైన వర్షం శనివారం రాత్రి వరకూ కురుస్తూనే ఉంది. రోడ్లన్నీ జలమయంగా మారాయి. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచింది. 13, 14, 28, 27 వార్డుల్లో వర్షపునీరు ఇళ్లలో చేరింది. పట్టణంలో రైల్వే స్టేషన్ రోడ్డు, తూర్పు బావి, అంబేడ్కర్ సెంటర్, ప్రభుత్వాసుపత్రి, కొమ్మళ్ల కాలువ, నెహ్రూ నగర్, ప్రధాన రహదారి, రింగు రోడ్డు, సొసైటీ కాలనీకి వెళ్లే దారి, రోడ్లన్నీ భారీగా వర్షపు నీరు చేరి వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇటుకల బట్టీల్లో నీరు చేరింది.

మునిగిన పంటలు..

పిడుగురాళ్ల: ఎడతెరిపి లేని వర్షాలకు పంటలు నీట మునిగాయి. పత్తి, మిరప, మినుము వంటి పంటలను రైతులు కాపాడుకునేందుకు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముందుగానే వేసిన పత్తి పంట చేతికి వచ్చిన సమయంలో మునిగిపోవడంతో తీవ్రంగా నష్టపోయినట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. పిడుగురాళ్ల పట్టణంలోని బుగ్గ వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. చెరువు పరిసర ప్రాంతాలు నీట మునిగాయి. ఎర్రవాగు ఉద్ధృతిగా ఉంది. శ్రీనివాస కాలనీ వద్ద పంట పొలాలు మొత్తం నీటిలో మునిగాయి. అదేవిధంగా జగజ్జీవన్‌రామ్ కాలనీ, ఆదర్శనగర్, లెనిన్‌నగర్ వంటి శివారు ప్రాంతాలు నీట మునిగాయి.

పొంగిపొర్లుతున్న వాగులు

గురజాల : భారీ వర్షాలకు మాడుగుల–అంజనాపురం గ్రామాల మధ్యలోని ఎద్దుల వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. మాడుగుల, గురజాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురం రైల్వే గేటు వద్ద కాలువ ఉద్ధృతంగా ప్రవహించింది. కారంపూడి రహదారి చెరువును తలపిస్తోంది. కాలువల నీరు పారుదల లేకపోవడంతో వర్షపు నీరు అంతా రోడ్డుపైకి చేరింది. 2014లో పొంగి పొర్లిన దండివాగుకు మళ్లీ వరద పోటెత్తింది. గురజాల, చర్లగుడిపాడు, మాడుగుల, గ్రామాల సరిహద్దు ప్రాంతాల్లో రోడ్లపైకి నీరు చేరింది.

పిడుగురాళ్లరూరల్:

మండలంలోని అన్ని గ్రామాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. కరాలపాడు నుంచి తుమ్మల చెరువు మధ్య వాగు ఉద్ధృతికి రాకపోకలు స్తంభించాయి.



కొత్తపల్లి, విజయపురిసౌత్ ప్రధాన రహదారిలో ఇలా..



కరాలపాడు, తుమ్మలచెరువు మధ్య రోడ్డుపై వరద ప్రవాహం

రెంటచింతలలో..



పశర్లపాడు సమీపంలో పిల్లివాగు ఉద్ధృతి

రెంటచింతల: రెంటచింతల గ్రామ శివారులోని గోలివాగు పొంగి పొర్లుతోంది. మాచర్ల– గుంటూరు రహదారిలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గుంటూరుకు వెళ్లే ఆర్టీసీ బస్సు వాగు మధ్యలో నిలిచిపోయింది. పొక్లెయినర్‌తో సాయంతో ఒడ్డుకు చేర్చారు. పిల్లి వాగు ప్రమాద భరితంగా ప్రవహిస్తోంది. పాలువాయి, తుమృకోట గ్రామాలకు ఇతర గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మిట్టగుడిపాడు– గోలి గ్రామాల మధ్య నున్న నేంద్రవాగు వద్ద పోలీసులు కాపలా ఉన్నారు. పల్లపు ప్రాంతాల్లోని పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. ముందుగా వేసిన పత్తి పంటకు నష్టం వాటిల్లుతుందని, వరి, మిర్చి పంటలకు వాన మేలు చేస్తుందని ఏవో బ్రహ్మారెడ్డి తెలిపారు.



మాచర్లలో పత్తి పొలంలో చేరిన వర్షపు నీరు



పొంగి పొర్లుతున్న గోలివాగు

కారెంపూడి: భారీ వర్షాలకు నాగులేరు వాగులో వరద ఉద్ధృతి అధికంగా ఉంది. నల్లమల అటవీ ప్రాంతం నుంచి వర్షపు నీరు వాగుకు చేరుతోంది. వ్యర్థాలన్నీ వరద నీటిలో కొట్టుకుపోయాయి. పేటసన్నెగండ్ల ఎన్ఎస్‌పీ కాల్వ సమీపంలో రాళ్ల వాగు వరద నీటితో ప్రవహించింది. పత్తి పంట సాగుచేసిన రైతులు పత్తి తడిసి నాణ్యత నష్టపోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కారెంపూడి వీర్ల గుడి వద్ద నాగులేరు వరద ఉద్ధృతి

దుర్గి: రెండు రోజులుగా ఎడతెరిపి లేని వర్షంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తీసేందుకు సిద్ధంగా ఉన్న పత్తి పంట తడిసి, రైతులకు నష్టాన్ని కలిగించింది. ఆత్మకూరు చెరువుకు భారీగా నీరు చేరింది. 10 సెం.మీ.లపైగా వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖాధికారులు తెలిపారు. ఇంకా మూడు రోజులు వర్షం ఉంటుందని వెల్లడించారు.



మాచర్ల: రైల్వే స్టేషన్ రోడ్డులో భారీగా నిలిచిన వర్షపు నీరు



గురజాలలోని కారంపూడి రోడ్డులో నిలిచిన వర్షపునీరు



దాచేపల్లి: రామాపురం వద్ద ఉద్ధృతంగా కృష్ణానది

దాచేపల్లి : భారీ వర్షం కురుస్తుండటంతో శనివారం ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ప్రభుత్వ పాఠశాలలకు సెలవు ప్రకటించారు. నడికుడి–నారాయణపురం మార్గంలో రెండు వాగులు పొంగి పొర్లుతుండటంతో రాకపోకలు పూర్తిగా నిలిచాయి. నడికుడి–పులిపాడు గ్రామాల మధ్య ఉన్న ఆర్‌యూబీలో వర్షపునీరు నిలవడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగింది. కాటేరు వాగు కూడా ఉద్ధృతంగా ప్రవహించింది. ముందస్తుగా వేసిన పత్తి పంటలో పత్తి కాసింది. వర్షపునీటిలో తడిసి పాడైపోయింది. కాయలు, పూత రాలి నేలపాలైంది. మిరప పంటలో వర్షపునీరు నిలిచింది. కృష్ణానదిలో వరద నీటి ప్రవాహం పెరగడంతో పరీవాహక గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ క్రస్ట్‌గేట్ల నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తుండటంతో నదిలో భారీగానే నీరు చేరింది. దీనికి తోడు భారీ వర్షాల కారణంగా నదిలో నీటి ప్రవాహం బాగా పెరిగింది. ఈ నేపథ్యంలో నది పరీవాహక గ్రామాలైన పొందుగల, రామాపురం గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. నదిలో నీటి ప్రవాహం పెరిగితే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ఎంపీపీ కందుల జాను, వైస్ ఎంపీపీ తండా అబ్దుల్‌సత్తార్, తహశీల్దార్ వైవీ. కుటుంబరావు, ఆర్ఐ శరత్‌కుమార్ తదితరులు గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడారు.

మాచవరం: మండలంలోని నాగేశ్వరపురం తండా సమీపంలోని పిల్లేరు చప్టాపై వరద నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఎస్ఐ సతీష్ వాగును పరిశీలించి, గ్రామస్తులకు తగు సూచనలు చేశారు. బెల్లంకొండ మండలానికి రాకపోకలు నిలిపివేశారు. పత్తి, కంది, వరి పొలాలు అక్కడక్కడా నీట మునిగాయి.



ఉద్ధృతంగా ప్రవహిస్తున్న పిల్లేరు వాగు



గామాలపాడులోని పత్తి పొలంలో వర్షపు నీరు



నారాయణపురం - నడికుడి గ్రామాల మధ్య వాగులో నీటి ప్రవాహం

లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ



పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని



శ్రీనగర్‌లో పింఛను అందజేస్తున్న తహసీల్దారు

దాచేపల్లి : పింఛన్ల నగదు పంపిణీ ప్రక్రియ శనివారం చేపట్టారు. మండలంలో 10, 342 పింఛనుదారులకు ఎంపీపీ కందుల జాను, వైస్ ఎంపీపీ తండా అబ్దుల్ సత్తార్, తహసీల్దార్ వైవీ.కుటుంబరావు, ఎంపీడీవో శోభారాణి, ఈవోపీఆర్డీ నాగెండ్ల రత్నం పింఛన్ నగదు అందజేశారు. 92శాతం పంపిణీ పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు.

మాచర్లలో 82శాతం..

మాచర్ల: పట్టణంలో శనివారం పింఛను నగదును లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది పంపిణీ చేశారు. స్పెషలాఫీసర్ గబ్రూ నాయక్, కమిషనర్ నాగేశ్వరరావు పర్యవేక్షించారు. సాయంత్రానికి 6,464 పింఛన్లకు గాను 82 శాతం పైగా పంపిణీ పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు.

పంపిణీ చేసిన ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల: పట్టణంలో పింఛన్ పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పాల్గొని, పింఛను నగదు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ 1వ తేదీ ఆదివారం కావడంతో పింఛన్ పంపిణీకి ఆటంకం కలగకూడదని సీఎం చంద్రబాబునాయుడు ముందుగానే పింఛన్ పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. టీడీపీ,జనసేన నాయకులు పాల్గొన్నారు.

దుర్గిలో 82 శాతం..

దుర్గి: మండలంలోని 13 సచివాలయాల పరిధిలో శనివారం 82 శాతం పింఛను పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ జీఎల్ఎన్ గుప్తా తెలిపారు. మొత్తం 6,790 పింఛన్‌లకు గాను రూ.2,36,27,000 నగదు అందజేసినట్లు వివరించారు. కోలగుట్ల సచివాలయం పరిధిలో స్పెషలాఫీసర్, జిల్లా నోడల్ అధికారి కె.సంజీవరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండల బీజేపీ అధ్యక్షుడు వెలిదండి శ్రీనివాసరావు పంపిణీలో పాల్గొన్నారు.

మాచర్ల రూరల్: మండలంలోని భైరవునిపాడు, తాళ్ళపల్లి, కొప్పునూరు గ్రామాల్లో ఎంపీడీఓ కె.సరోజనీదేవి శనివారం పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు. ప్రత్యేకాధికారి గబ్రూనాయక్, పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు సిబ్బంది ఉన్నారు.

శ్రమకు తగిన వేతనం ఇవ్వాలి



మాట్లాడుతున్న పీడీఎం, ఎంసీపీఐ నాయకులు

పిడుగురాళ్ల: కార్మికుల శ్రమను కొల్లగొడుతున్న సున్నపు బట్టీ యజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని, వారి శ్రమకు తగిన వేతనం ఇవ్వాలని పీడీఎం, ఎంసీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. లెనిన్ నగర్‌లో ఉన్న ఎంసీపీఐ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులతో 12 గంటల వరకు పని చేయించుకొని, వారికి కనీసం వేతన ఇవ్వడం లేదన్నారు. సరైన బొగ్గును వాడకుండా కార్మికుల ప్రాణాలతో చెలగాటం ఆడటం సరైన పద్ధతి కాదన్నారు. కనీస సౌకర్యాలు లేక ఎన్నో సార్లు ప్రమాదాలకు గురికావడం, కొంత మంది ప్రాణాలను కూడా విడుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, కార్మికులకు తగిన సౌకర్యాలు, జీతాలు ఇచ్చేవిధంగా చూడాలని కోరారు. పీడీఎం రాష్ట్ర నాయకులు వై.వెకటేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు కె శ్రీనివాసరావు, సెంటర్ ట్రేడ్ యూనియన్ నాయకులు కోటేశ్వరరావు, ఎంసీపీఐ నాయకులు పాల్గొన్నారు.

తప్పులు తెలుసుకుని సత్ప్రవర్తనతో మెలగాలి



సత్తెనపల్లి: క్షణికావేశంలో చేసిన తప్పులను తెలుసుకొని సత్ప్రవర్తనతో మెలగాలని సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని సబ్ జైలును శనివారం న్యాయమూర్తుల బృందం సందర్శించింది. సబ్ జైలులో ఉన్న రిమాండ్ ముద్దాయిలను వాళ్లకు అందుతున్న వసతులను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి నాగ వెంకట శ్రీనివాసరావు మాట్లాడుతూ క్షణికావేశంలో చేసిన తప్పులను తెలుసుకొని సత్ప్రవర్తనతో మెలగాలని తెలిపారు. వారికి చట్టపరంగా ఉన్న హక్కులను వివరించారు. పరిసరాలను, ఆహార పదార్థాలను, సరుకుల నాణ్యతను పరిశీలించారు. సత్తెనపల్లి ప్రధాన సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తౌషిద్ హుస్సేన్, సత్తెనపల్లి మొదటి అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ప్రియదర్శిని, సబ్ జైలు సూపరింటెండెంట్ టి.వెంకటరత్నం సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

చిలకలూరిపేటటౌన్: హత్య కేసులో నిందితులు నలుగురిని అర్బన్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... పిడుగురాళ్ల సమీపంలోని కొండమోడు విద్యుత్ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి రమావత్ నందునాయక్ (36)ఈ ఏడాది జులై 9 తేదీన పట్టణంలోని గ్రంథాలయం బజారులో స్పృహతప్పి తీవ్రగాయాలతో పడి ఉన్నాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరుసటి రోజు మృతి చెందాడు. నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు ఆదేశాలతో పట్టణ సీఐ పి.రమేష్ నేతృత్వంలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మద్యం మత్తులో నందునాయక్ పట్టణంలోని బొందిలిపాలెం రావిచెట్టు వీధిలోని ఇళ్లల్లోకి వెళ్లే ప్రయత్నం చేశాడు. అక్కడి వారు ఎంత వారించినా వినకపోవడంతో అతనిపై దాడి చేశారు. స్పృహ కోల్పోవడాన్ని గమనించి అతన్ని గ్రంథాలయం వీధిలో బైక్‌పై తెచ్చి పడేసినట్లు పోలీసుల విచారణలో తెలిసింది. దీంతో నిందితులైన చేజర్ల గిరిహనుమాన్ సింగ్, సులేమాన్, క్షత్రి సాయి సింగ్, కారుమూరి గిరి దుర్గా ప్రసాద్ పోలీసుల ముందు నేరం ఒప్పుకోవడంతో గతనెల 30న అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరుపరిచనట్లు తెలిపారు.

14న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న న్యాయమూర్తి వై.శ్రీనివాసరావు

గురజాల: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని గురజాల ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం కోర్టులో జరిగిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఆర్ శరత్‌బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. పరిష్కరించదగిన సివిల్, క్రిమినల్ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.సత్యనారాయణ, న్యాయవాదులు మందపాటి శ్రీనివాసరెడ్డి, షేక్ జానీబాష, హనుమంతరావు, పోలీసులు, లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యానికే మొదటి ప్రాధాన్యం



సమావేశంలో వైద్యులు, రోటరీ క్లబ్ సభ్యులు

మాచర్ల: ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని కేసీపీ జనరల్ మేనేజర్ వెంకటరమణ, రోటరీ డిస్ట్రిక్ట్ డిప్యూటీ గవర్నర్ కె.రామకోటయ్య అన్నారు. శనివారం పట్టణంలోని పద్మావతి నర్సింగ్ హోం, కేసీపీ యాజమాన్యం సహకారంతో వెలగపూడి లక్ష్మణదత్తు ఆడిటోరియంలో బేసిక్ లైఫ్ సపోర్టు ఫస్ట్ ఎయిడ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఆరోగ్యమనేది ఎంతో ముఖ్యమన్నారు. అవగాహన సదస్సులో వైద్యులు వెంకటేష్, మౌనిక, భవ్యశ్రీ హార్ట్, బ్రెయిన్ ఎటాక్, పాము కాటు, పెరాలసిస్, రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన ప్రాథమిక జాగ్రత్తలు వివరించారు. జూనియర్ కళాశాలల విద్యార్థులకు, కమ్యూనిటీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, హెల్త్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రోగ్రాం కన్వీనర్ మారేపల్లి లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. రోటరీ క్లబ్ అధ్యక్షురాలు కొండవీటి కృష్ణకుమారి, కార్యదర్శి నిమ్మగడ్డ సురేఖ, సభ్యులు జయసింహారెడ్డి, నాగూర్ వలి, సత్య ప్రసాద్, నాగార్జునరెడ్డి, శ్రీనివాసరావు తదితరులున్నారు.